సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం । 18 । డిసెంబర్ । 2024



అక్రమ కట్టడాల కూల్చివేత
మిర్యాలగూడ పట్టణంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను అధికారులు తిరిగి స్వాధీనం చేసుకుంటున్నారు. - 8లో



అధిక వడ్డీ ఆశ చూపి
అధిక వడ్డీ ఆశ చూపి అప్పు చేసిన వ్యక్తి తిరిగి చెల్లించలేక తన పొలాన్ని మధ్యవర్తుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేశాడు. - 8లో



నీటి విడుదలకు సన్నాహాలు
మూసీ ఆయకట్టులో యాసంగి పంటల సాగుకు నీరు విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. - 10లో

న్యూస్‌రీల్

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం శ్రీఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. హనుమంతుడికి నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించి, సాయంత్రం వెండి జోడు సేవ పూజలు నిర్వహించారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

బొమ్మలరామారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అధికారులకు సూచించారు. బొమ్మలరామారం మండలంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. సర్వే సమగ్రంగా నిర్వహించాలని, తప్పులు దొర్లకుండా పారదర్శకంగా చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీల వారీగా ఎన్నికల ఓటరు తుది జాబితా ఎంపీడీఓ కార్యాలయం నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్, సూపరింటెండెంట్ గడ్డం జ్ఞాన ప్రకాష్ రెడ్డి, ఎంపీఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు



గౌరాయపల్లి గ్రామంలో ఎరువుల వివరాలను పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్

యాదగిరిగుట్ట రూరల్: రసాయన ఎరువులను, మందులను రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ సంచాలకులు (డీఏఓ) గోపాల్ అన్నారు. యాదగిరిగుట్ట మండలంలోని గౌరాయపల్లి, కాచారం, మాసాయిపేట గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో నిల్వ ఉన్న ఎరువుల వివరాలు, రోజు వారీ రిజిస్టర్లు, ఈపీఓఎస్ మెషిన్లను పరిశీలించారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. నిషేధిత పురుగు మందులను ఎవరూ అమ్మకూడదని తెలిపారు. అనంతరం మాసాయిపేట గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శాంతి నిర్మల, మండల వ్యవసాయాధికారిణి సుధారాణి, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలి



ఆర్టీసీ డిపో ఆవరణలో నాటుతున్న రీజనల్ మేనేజర్ జానిరెడ్డి, ఆర్టీసీ ఉద్యోగులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి వచ్చే ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని ఆర్టీసీ నల్లగొండ రీజనల్ మేనేజర్ జానిరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన యాదగిరీశుడిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేసి, పట్టణంలోని ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా బస్టాండ్, గ్యారేజీలను పరిశీలించారు. అనంతరం డిప్యూటీ రీజనల్ మేనేజర్ శివశంకర్‌తో కలిసి డిపో ఆవరణలో మొక్కలు నాటారు. అంతకు ముందు రీజనల్ మేనేజర్ జానిరెడ్డిని డిపో మేనేజర్ శ్రీనివాస్, ఉద్యోగులు, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్, జాకబ్, ముత్యాలు, నరసింహ, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

చలిలోనే జీవన పోరాటం

అర్ధరాత్రి నుంచే పనుల్లో నిమగ్నమవుతున్న వివిధ వర్గాల ప్రజలు

- ఆటోడ్రైవర్లు, టిఫిన్ సెంటర్ల వారికి తప్పని బతుకు పోరాటం
- రాత్రి నుంచే రోడ్లను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు
- ప్రధానకూడళ్లు, బస్టాండ్లలో కునుకుతీస్తున్న నిరాశ్రయులు
- రాత్రి 11 గంటలకే నిర్మానుష్యమవుతున్న పట్టణ రహదారులు
- భువనగిరి, యాదగిరిగుట్ట, చౌటుప్పల్‌లో సోమవారం రాత్రి సాక్షి విజిట్



భువనగిరి పట్టణంలో మంగళవారం తెల్లవారు జామున వీధులు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు

మూడు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలికి వణుకుతూనే ప్రజలు తమ రోజు వారీ పనులు కొనసాగిస్తున్నారు. పట్టణాల్లో రాత్రి ఒంటి గంట వరకు జనాలతో ఉండే చౌరస్తాలు రాత్రి 11 గంటలకే నిర్మానుష్యంగా మారుతున్నాయి. సోమవారం రాత్రి (మంగళవారం తెల్లవారుజామున) భువనగిరి, యాదగిరిగుట్ట, చౌటుప్పల్‌లో సాక్షి విజిట్ చేయగా.. టిఫిన్ బండ్ల వ్యాపారులు, పారిశుద్ధ్య కార్మికులు, రైతులు, డ్రైవర్లు, కూరగాయల వ్యాపారులు, మెడికల్ షాపులు, పేపర్ బాయ్‌లు, సెక్యూరిటీ గార్డులు చలికి వణుకుతూ తమ పనులు చేసుకుంటున్నారు.

– సాక్షి,యాదాద్రి, భువనగిరి, భువనగిరి టౌన్, చౌటుప్పల్, యాదగిరిగుట్ట



యాదగిరిగుట్టలో చలి తీవ్రతకు చాయ్ తాగుతున్న మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది

తొందరగా మూతపడుతున్న హోటళ్లు..

- భువనగిరి పట్టణంలో నిరాశ్రయులు ప్రధానకూడళ్లు, బస్టాండ్లలో వణికించే చలిలోనే కునుకుతీస్తున్నారు.
- అర్ధరాత్రి దాటిన తర్వాత స్ట్రీట్ హోటల్స్, ఇసుక కార్మికులు, పాలు, బ్రెడ్ సరఫరా చేసేవారు తమ పనుల్లో బిజీగా ఉంటారు. కానీ చలి కారణంగా స్ట్రీట్ హోటల్స్ రాత్రి 11 గంటలకే మూసివేస్తున్నారు.
- పాలు సరఫరా చేసే వారు అర్ధరాత్రి దాటిన తర్వాత కాకుండా ముందుగానే సరఫరా చేస్తున్నారు.
- ఆటో డ్రైవర్లు చలికి తట్టుకుంటూ తమ ఆటోలు నడుపుతున్నారు.
- పారిశుద్ధ్య కార్మికులు తెల్లవారుజామునే తమ పనుల్లో నిమగ్నమవుతున్నారు.

చలికి వణుకుతూ ఆరుబయట

- యాదగిరిగుట్ట ఆలయం వద్ద ఉండే యాచకులు రాత్రి సమయంలో చలి తీవ్రతకు ఆర్టీసీ బస్టాండ్‌లో పడుకుంటున్నారు.
- వైకుంఠద్వారం వద్ద సుమారు ఎనిమిది మంది యాచకులు సర్కిల్‌లో నిద్ర చేస్తున్నారు.
- వైకుంఠద్వారం కింది భాగంలోని మెట్ల సమీపంలో 10 మంది చలిలోనే నిద్రిస్తున్నారు.
- తులసీ కాటేజీలో హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం వద్ద సెక్యూరిటీ రాత్రంతా చలిలోనే బయట కూర్చొని ఉంటున్నారు.
- యాదగిరి కొండపైకి వెళ్లే మొదటి ఘాట్ రోడ్డులో వాహనాలు వెళ్లకుండా ఉండేందుకు హోంగార్డు, సురక్ష సిబ్బంది చలిలోనే కాపలా కాస్తున్నారు.
- ఇక ఉదయం 4.30గంటలకు మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది చలిలోనే పనులు చేస్తున్నారు.

బస్సుల కోసం నిరీక్షణ

- చౌటుప్పల్‌లో రాత్రి 11 గంటల తర్వాత ఎక్కడా జనాలు కన్పించని పరిస్థితి నెలకొంది. దుకాణాలు ఎక్కడికక్కడ మూసివేస్తున్నారు. ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో కూడా నిర్మానుష్య వాతావరణం ఏర్పడుతోంది.
- ఆంధ్రా ప్రాంతానికి వెళ్లే ప్రయాణికులు అర్ధరాత్రి సమయంలో చలికి వణుకుతూ బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు.
- నిత్యం తెరిచి ఉండే మెడికల్ దుకాణాలు కూడా రాత్రి 11గంటలకే మూసివేస్తున్నారు.
- మున్సిపాలిటీ సిబ్బంది తెల్లవారుజామున ఐదు గంటలకు విధుల్లోకి చేరుకుని.. చలిలోనే పనులు కొనసాగిస్తున్నారు.



ఆంధ్ర ప్రాంతానికి వెళ్లేందుకు చౌటుప్పల్‌లో అర్ధరాత్రి వేచి ఉన్న ప్రయాణికులు

గిరాకీ రావడం లేదు



చలి తీవ్రత పెరుగుతోంది. రాత్రి ఎనిమిది దాటితే జనం రోడ్డుపై కనిపించే పరిస్థితులు లేవు. ఉదయం ఎనిమిది దాటితేనే జనం సాఫీగా రోడ్డెక్కుతున్నారు. మాకు రాత్రి కస్టమర్లు రాకపోవడంతో వ్యాపారం కోల్పోతున్నాం. పది గంటలకే హోటల్ పూర్తిగా మూసివేస్తున్నాం.

– గోపాలకృష్ణశెట్టి, ప్రసాద్ హోటల్ యజమాని, చౌటుప్పల్

మరికొన్ని ఫోటోలు 8లో



భువనగిరిలో తీవ్రమైన చలిలో టీ కాస్తున్న హోటల్ నిర్వాహకుడు



బస్సులు లేకపోవడంతో రాత్రి సమయంలో బస్టాండ్‌లో నిద్రిస్తున్న ప్రయాణికులు



యాదగిరి కొండపైకి వెళ్లే మొదటి ఘాట్ రోడ్డు వద్ద అర్ధరాత్రి కాపలా కాస్తున్న పోలీసు సిబ్బంది

కొనసాగుతున్న సీఎం కప్ క్రీడాపోటీలు



రన్నింగ్ పోటీలు ప్రారంభిస్తున్న జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజనేయులు

భువనగిరి: పట్టణంలో ఈ నెల 16న ప్రారంభమైన జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అథ్లెటిక్స్, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజనేయులు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బాలకృష్ణ, ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి, అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ గోపాల్ పాల్గొన్నారు.

అధికారుల విచారణ

వలిగొండ: మండలంలోని లోతుకుంట ఆదర్శ పాఠశాల విద్యార్థులపై దాడి చేసి గాయపరిచిన ఘటనపై అధికారులు తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో విచారణ చేశారు. వివరాలు సేకరించి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. వారి వెంట ఎంపీడీఓ జితేందర్ రెడ్డి ఉన్నారు.



పాఠశాలలో విచారణ చేస్తున్న అధికారులు

ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

చౌటుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు మినహా ఏ హామీని అమలు చేయలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్ ఆరోపించారు. సీపీఎం జిల్లా మహాసభల్లో భాగంగా మంగళవారం మూడోరోజు ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి, ప్రజల్లో సుస్థిర స్థానం పొందేందుకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. వారు మాట్లాడుతూ.. ఓట్ల కోసం ఎన్నో హామీలు గుప్పించి వాటిని అమలు చేయకుండా కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. తక్షణమే హామీలను పూర్తిగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. బీజేపీ అనుసరిస్తున్న విభజన రాజకీయాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని శ్రేణులకు సూచించారు. ప్రజల పక్షాన పోరాటాలు చేసేది కేవలం వామపక్షాలు మాత్రమేనని తెలిపారు. మహాసభలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, నాయకులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, పైళ్ల ఆశయ్య, బొంతల చంద్రారెడ్డి, మంగ నర్సింహులు, మాటూరు బాలరాజు, కల్లూరు మల్లేషం, దోనూరు నర్సిరెడ్డి, దాసరి పాండు, మేక అశోక్‌రెడ్డి, బూరుగు కృష్ణారెడ్డి, ఎండీ పాష, గంగదేవి సైదులు, గోశిక కరుణాకర్, బండారు నర్సింహ, పల్లె మధుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

- కలెక్టర్ హనుమంతరావు



రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

రామన్నపేట: ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో ఇన్‌పేషంట్లు తక్కువమంది ఉండడానికి గల కారణాలపై ఆరా తీశారు. ఇన్‌పేషెంట్లకు పెట్టేందుకు సిద్ధంగా ఉన్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యతగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఓపీ విభాగంలో అందిస్తున్న వైద్యసేవలు, అనంతరం సూపరింటెండెంట్ గదిలో రికార్డులు పరిశీలించారు. ఒకేరోజు 60శాతం మందికి సెలవు మంజూరు చేయడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకేసారి ఎక్కువ మందికి సెలవు ఎలా మంజూరు చేశారని సూపరింటెండెంట్‌ను ప్రశ్నించారు. డాక్టర్ ఆదిలక్ష్మి ఏడాది కాలంగా విధులకు హాజరు కాకపోవడాన్ని గమనించి విధుల నుంచి తొలగించేందుకు ప్రతిపాదనలు పెట్టాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. స్థానికులు మంచినీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే భగీరథ కనెక్షన్ ఇవ్వాలని ఎస్ఈకి సూచించారు. అనుభవం కలిగిన రెగ్యులర్ గైనకాలజిస్టును తక్షణమే నియమించాలని డీసీహెచ్ఎస్‌ను ఆదేశించారు. ఆయనవెంట సూపరింటెండెంట్ ఈశ్వర్, డాక్టర్ వరుణ్‌రెడ్డి ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



నెమలికాలువలోని సీసీఐ కేంద్రంలో పత్తి తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

వలిగొండ: పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం వలిగొండ మండలంలోని నెమలికాలువలో గల వెంకటేశ్వర శ్రీ సాయి జిన్నింగ్ మిల్లును కలెక్టర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... రైతులు పండించిన పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రంలోనే అమ్ముకోవాలన్నారు. దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని రైతులకు సూచించారు. అనంతరం ట్యాబ్ ఎంట్రీ వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఆలేరును రెవెన్యూ డివిజన్ చేయాలి

- అసెంబ్లీలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఐలయ్య

యాదగిరిగుట్ట: ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అసెంబ్లీలో మంగళవారం సర్కారు దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా తనకు ఇచ్చిన సమయంలో ఆయన ప్రసంగించారు. గత ప్రభుత్వంలో రెవెన్యూ డివిజన్‌ల ఏర్పాటు శాస్త్రీయంగా జరగలేదన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కొత్త డివిజన్లు, కొత్త మండలాలను ఏర్పాటు చేసింది కానీ రైతులు, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని చేయలేదన్నారు. రాష్ట్రంలో చాలా చోట్ల రెవెన్యూలో అనేక భూ సమస్యలు పెరిగాయని, అనేకం అపరిష్కృతంగా ఉండడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. అందుకే కొత్త రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వస్తుందన్నారు. ప్రస్తుతం ఆర్డీఓలను కలిసేందుకు రైతులు, భూమి హక్కుదారులు 50 నుంచి 70 కిలోమీటర్ల కంటే ఎక్కువ ప్రయాణిస్తున్నారని, అంత దూరం ప్రయాణం లేకుండా ఉండేందుకు పరిపాలనా సౌలభ్యం కోసం ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో 17 మండలాలకు రెండు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయని, భువనగిరి రెవెన్యూ డివిజన్ పైన అధిక పని భారం పడుతుందన్నారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో దాదాపు 8 మండలాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. దానితో పాటు రాజపేట మండలంలోని రఘునాథపురం గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. మోటకొండూరు మండలంలో దగ్గర ఉన్న అన్ని గ్రామాలను పరిగణనలోకి తీసుకోకుండా దూరంగా ఉన్న గ్రామాలను కలపడం వల్ల ఇబ్బందిగా ఉందన్నారు. ఇలాంటివి దగ్గర ఉన్న మండలంలో కలపాలని కోరారు. ఈ విషయమై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించి కలెక్టర్‌తో సమాచారం సేకరించిన అనంతరం ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

- డీఈఓ సత్యనారాయణ



పాఠశాల కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సత్యనారాయణ

ఆలేరురూరల్: విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ విజ్ఞానాన్ని వెలికితీయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వృత్తిపర నైపుణ్యాలను పెంపొందించడంలో కాంప్లెక్స్ సమావేశాలు దోహదం చేస్తాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ చదవడం, రాయడం, గణిత సామర్థ్యాలు పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంఈఓ లక్ష్మి, ఉపాధ్యాయులు మంజులు, వెంకటయ్య, కోట శ్రీనివాస్‌రావు, శోభ, రవి, కిరణ్, దశమంతరెడ్డి, సయ్యద్, సుచిరత, శ్రీదేవి, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యనందించాలి

రాజాపేట: విద్యార్థులకు ఉన్నత విద్యనందించాలని డీఈఓ సత్యనారాయణ అన్నారు. మంగళవారం రాజాపేట మండలంలోని రఘునాథపురం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి వారితో కలిసి భోజనం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఆయన వెంట అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, మండల విద్యాధికారి చందా రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోజ్‌కుమార్ తదితరులున్నారు.

రైతుభరోసా ఏమాయే!

- పంటల సాగుకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిన రైతులు
- కోతలు పూర్తయినా ఇప్పటివరకు సాయం అందించని ప్రభుత్వం



ఆలేరురూరల్: పంట సాగుకు అయ్యే పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బందులకు గురికావొద్దనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేసింది. రెండు సీజన్‌లకు కలిపి ఎకరానికి రూ.10 వేల చొప్పున చెల్లించింది. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రైతు భరోసా పథకం కింద రైతులకు ఎకరానికి రూ.15 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. అయితే ప్రభుత్వం దీనిపై ఇప్పటివరకు మార్గదర్శకాలు విడుదల చేయలేదు. ఇప్పటికే రైతులు అప్పులు తెచ్చి పంట సాగు చేశారు. తెచ్చిన అప్పులకు వడ్డీ పెరుగుతుంది కానీ ఇప్పటివరకు పెట్టుబడి సాయం అందలేదని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో 2,71,590 మంది రైతులు

జిల్లాలో 421 గ్రామాల పరిధిలో పెట్టుబడి సాయం అందించేందుకు వ్యవసాయాధికారులు 2,49,206 మంది రైతులను గుర్తించారు. గత యాసంగిలో పంట రుణాలకు సంబంధించి ట్రెజరీకి అప్పగించారు. ప్రభుత్వం రూ.293 కోట్ల 68 లక్షలను రైతుల ఖాతాలో జమ చేశారు. వానాకాలం సీజన్ నుంచి రైతుభరోసా కింద పెట్టుబడి సాయాన్ని పెంచి అయితే సీజన్ ముగింపు దశకు చేరుకున్నా.. ఇప్పటివరకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించటంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం రైతులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలు సేకరించినా పెట్టుబడి సాయం కింద ఒక్కపైసా విడుదల చేయలేదు.

అప్పు తీసుకువచ్చాం



పంట సాగుకు పైసలు లేక పెట్టుబడి కోసం బయటి వ్యక్తుల దగ్గర వడ్డీకి అప్పులు తెచ్చా. పంట సాగు మొదలయ్యే సమయంలోనే ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికైనా మార్గదర్శకాలు విడుదల చేసి వెంటనే పెట్టుబడి సాయాన్ని అందించాలి.

– వట్టిపల్లి మొగులి మల్లయ్య, బహదూర్‌పేట

ఇప్పటివరకు అందించలేదు



వానాకాలం పంటల సాగు సంబంధించి కోతలు పూర్తయ్యాయి. అయినా ఇప్పటి వరకు పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం పంపిణీ చేయలేదు. ఇంకా ఎప్పుడు పంపిణీ చేస్తారో కూడా తెలియదు. పెట్టుబడి సాయం అనేది పంట పెట్టుబడి ఖర్చులకు ఉపయోగపడేలా ఉండాలి.

– గంగుల శ్రీనివాస్, ఆలేరు

క్లుప్తంగా

యజ్ఞం నిర్వహణకు అనుమతి ఇవ్వాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి తదితరులు

నల్లగొండ టూటౌన్: నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని గ్రామ కంఠం భూమి(అంగడి స్థలం)లో హనుమత్ గాయత్రీ యజ్ఞం నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆంజనేయ స్వాములు, నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి తరఫున మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, బీజేవైఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పజ్జూరు వెంకటరెడ్డి, నాయకులు కొరవి శంకర్, మెడబోయిన శ్రీనివాస్, నడింపల్లి శ్రవణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ చౌర్యం.. పలువురిపై కేసు నమోదు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా మంగళవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఇంటింటి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 12 బృందాలు మండలంలోని 373 ఇళ్లను తనిఖీ చేయగా 22 మంది మీటరు లేకుండా విద్యుత్ వాడుతుండటంతో వారిపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలను విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ ఫ్రాంక్లిన్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీఈ డీఈ స్వామినాయక్, ఏడీఈ రామునాయక్, స్థానిక ఏఈ వాస శ్రీకాంత్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భువనగిరి: భువనగిరి పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎదురుగా గల ఎలిమినేటి మాధవరెడ్డి విగ్రహం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతుడి వయస్సు సుమారు 70 నుంచి 75 సంవత్సరాలు ఉంటుందని, అనారోగ్యంతో పాటు ఆహారం తీసుకోకపోవడంతో మృతిచెందినట్లు తెలుస్తుందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712579973, 8712662803 నంబర్లను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

బస్సు దిగుతూ జారిపడి మహిళకు గాయాలు

సూర్యాపేటటౌన్: ఆర్టీసీ బస్సు దిగుతుండగా మహిళ జారిపడడంతో గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన బొల్లం స్వరాజ్యం మంగళవారం సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సు దిగుతుండగా అదుపుతప్పి కిందపడటంతో ఆమె చేయి టైరు కింద పడింది. దీంతో ఆమె చేయికి గాయం కావడంతో స్థానికులు వెంటనే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

• గజగజ వణికిస్తున్న చలిలో..



నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో అర్ధరాత్రి 12.30 గంటలకు చలిలో రోడ్లు ఊడుస్తున్న మున్సిపల్ కార్మికులు



సూర్యాపేటలో అర్ధరాత్రి కూరగాయలను దిగుమతి చేస్తున్న హమాలీలు



యాదగిరిగుట్ట ఆర్టీసీ బస్టాండ్ బయట నిద్రిస్తున్న ప్రయాణికులు



సూర్యాపేట పట్టణంలో ఉదయం టీ తాగుతున్న ప్రజలు



నల్లగొండలో ఉదయం చలి మంట వేసుకుంటున్న ప్రజలు



నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్‌లో అర్ధరాత్రి డ్యూటీ దిగి వస్తున్న కండక్టర్

అధిక వడ్డీ ఆశ చూపి మోసం

- 128 మంది నుంచి రూ.8కోట్ల మేర అప్పు తీసుకున్న ఘనుడు
- బాధితులు గొడవ చేయడంతో మధ్యవర్తుల పేరిట పొలం రిజిస్ట్రేషన్

చిలుకూరు: అధిక వడ్డీ ఆశ చూపి అప్పు తీసుకున్న వ్యక్తి తిరిగి అప్పు చెల్లించలేక తన పొలాన్ని మధ్యవర్తుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేశాడు. అయితే ఆ పొలం అమ్మగా వచ్చే డబ్బులు అప్పు తీర్చేందుకు సరిపోకపోగా.. ఆ పొలంలో తమకు వాటా ఉందని అతడి బంధువులు దున్నుకోవడంతో బాధితులు మంగళవారం చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. చిలుకూరు మండలం రామాపురం గ్రామానికి చెందిన కిషోర్ కొంతకాలం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. ఆ తర్వాత వ్యాపారం చేయడంతో పాటు ఫైనాన్స్ బిజినెస్ చేశాడు. అతని దగ్గర ఉన్న డబ్బులకు తోడు తెలిసివాళ్ల దగ్గర వడ్డీకి డబ్బులు తీసుకొని ఫైనాన్స్ నడిపించేవాడు. ప్రారంభంలో అందరికీ అధిక వడ్డీతో డబ్బులు మంచిగానే ఇచ్చాడు. దీంతో



చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

రామాపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాలైన ఆర్లెగూడెం, కోదాడలోనే కాకుండా అతని బంధువుల్లో కూడా ఇతడిపై నమ్మకం కలిగింది. అధిక వడ్డీ వస్తుండడంతో అతను ఎంత అడిగితే అన్ని డబ్బులు ఇవ్వడమే కాక, డబ్బులు ఉన్న వాళ్లు అతనికి పిలిచి మరీ ఇచ్చారు.

రూ.8 కోట్ల మేర అప్పు..

కిషోర్ రామాపురం, ఆర్లెగూడెం, కోదాడకు చెందిన వాళ్లు కాకుండా అతని బంధువులు మొత్తం 128 మంది నుంచి రూ.8 కోట్ల మేర అప్పు తీసుకున్నాడు. ఆరునెలల క్రితం అతడు ఐపీ పెడుతున్నట్లు గ్రామంలో పుకార్లు వచ్చాయి. దీంతో డబ్బులు ఇచ్చిన వాళ్లందరూ ఒక్కసారిగా డబ్బులు అడగడంతో అతడి వ్యవహారం మొత్తం బయటపడింది. ఒక్కొక్కరి వద్ద నుంచి కనిష్టంగా రూ.లక్ష, ఒకరి వద్ద నుంచి గరిష్టంగా రూ.80 లక్షల వరకు తీసుకున్నాడు. బాధితులు డబ్బులు తిరిగి ఇవ్వమని గొడవ చేస్తుండడంతో గ్రామానికి చెందిన పెద్దమనుషులు అతడితో మాట్లాడి అతడి పేరు మీద ఆర్లెగూడెం శివారులో ఉన్న 6 ఎకరాల భూమిని అమ్మి బాధితులకు డబ్బులు ఇవ్వాలని తీర్మానించారు. ఈ మేరకు 6 ఎకరాల భూమిని ఇద్దరు మధ్యవర్తుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. అంతేకాక రామాపురంలోని 2 ఎకరాలు, మునగాల మండలం ఆకుపాముల వద్ద ఉన్న 2 ఎకరాలు భూమి మొత్తం సుమారుగా 10 ఎకరాలు భూమిని అమ్మి బాధితులకు డబ్బులు ఇవ్వాలని పంచాయితీ తీర్మానం చేశారు. కానీ ఇప్పటివరకు ఆ భూములు అమ్మలేదని, దీంతో తమ డబ్బులు తమకు వస్తాయా లేవా అని బాధితులు లబోదిబోమంటున్నారు. పోలీసులు స్పందించి పూర్తిస్థాయి విచారణ చేసి న్యాయం చేయాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాల కూల్చివేత



జేసీబీతో అక్రమ కట్టడాలను కూల్చివేయిస్తున్న అధికారులు



తహసీల్దార్ హరిబాబుతో వాగ్వాదం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్

- తన సోదరి భూమిలో ఫెన్సింగ్ తొలగించడంతో తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగిన మున్సిపల్ చైర్మన్
- అది ప్రభుత్వ భూమి కావడంతోనే తొలగించామంటున్న అధికారులు

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను అధికారులు తిరిగి స్వాధీనం చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలు, ఫెన్సింగ్‌ను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. మిర్యాలగూడ పట్టణంలోని నార్కట్‌పల్లి–అద్దంకి రహదారి వెంట సర్వే నంబర్ 626లోని ప్రభుత్వ భూమిని మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ సోదరి రాయపూడి భవాని ఆక్రమించినట్లు గుర్తించిన రెవెన్యూ, పోలీసు అధికారులు మంగళవారం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆదేశాల మేరకు ఆ సర్వే నంబర్‌లో వేసిన ఫెన్సింగ్‌ను, ఇతర కట్టడాలను తొలగించారు.

ఆక్రమణకు గురైన సుమారు మూడు గుంటల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సమయంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, తహసీల్దార్ హరిబాబు మధ్య వాగ్వాదం జరిగింది. దీని విలువ సుమారు రూ.కోటి ఉంటుందని తెలుస్తోంది. ఆ రహదారి వెంట తాపీ, సెంట్రింగ్, వడ్రంగి సంఘాలు నిర్మించిన గదిని జేసీబీ సహాయంతో తొలగించి 12గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ నిర్మాణాల తొలగింపును సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ స్వయంగా పర్యవేక్షించారు. సుమారు నాలుగు గంటల పాటు అక్రమ కట్టడాల కూల్చివేతలు జరిగాయి.

ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే కూల్చివేశాం

అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై సర్వే నంబర్ 626లో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్లు మా విచారణలో తేలింది. కోట్ల రూపాయల విలువ చేసే భూమిని కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– హరిబాబు, తహసీల్దార్

నోటీసులు ఇవ్వకుండానే కూల్చేశారు

అద్దంకి–నార్కట్‌పల్లి రహదారి వెంట నా సోదరి రాయపూడి భవాని 2012లో పట్టా భూమిని కొనుగోలు చేసింది. సర్వే నంబర్ 711లో 22 గుంటల భూమిని కొనుగోలు చేశాం. అప్పుడే ఫెన్సింగ్ ఏర్పాటు చేశాం. ఇప్పుడు రెవెన్యూ అధికారులు వచ్చి ప్రభుత్వ భూమి అని మేము వేసిన ఫెన్సింగ్‌ను కనీసం సమాచారం ఇవ్వకుండానే తొలగించారు. అధికారుల చర్యలు కక్ష సాధింపు చర్యలుగా ఉన్నాయి.

– తిరునగరు భార్గవ్, మున్సిపల్ చైర్మన్

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య

మిర్యాలగూడ టౌన్: మద్యం మత్తులో ఓ యువకుడు ఎలుకల నివారణ ట్యాబెట్లు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ పిల్లి లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం బాదలాపురం గ్రామానికి చెందిన కన్నెంకటి రాకేష్(24) గూడూరు గ్రామ శివారులోని ఆర్ఎస్‌వీ రైస్‌మిల్లులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగానే రాకేష్ సోమవారం కూడా మిల్లుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. డ్యూటీకి వెళ్లిన కుమారుడు రాత్రి వరకు కూడా ఇంటికి రాకపోవడంతో అతడి తండ్రి కుమారస్వామి భయాందోళనకు గురై రాకేష్ మిత్రుడు నల్లమేకల శ్రీనివాస్‌తో కలిసి గాలిస్తుండగా మంగళవారం ఉదయం గూడూరు గ్రామ శివారులో ఖాళీ స్థలంలో రాకేష్ విగతజీవిగా ఉండటం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ పిల్ల లోకేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. మృతదేహం వద్ద బీరు బాటిల్‌తో పాటు ఎలుకల నివారణకు ఉపయోగించే ట్యాబ్లెట్లు ఉండటం గమనించారు. రాకేష్ మిల్లుకు సరిగా వెళ్లడం లేదని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి వివాహం కాలేదు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



రాకేష్ (ఫైల్)

మిరప పంటను ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు



గడ్డి మందు పిచికారీ చేయడంతో వాడిపోయిన మిరప పంట

నాగారం: గుర్తుతెలియని వ్యక్తులు మిరప పంటపై గడ్డి మందు పిచికారీ చేసి ధ్వంసం చేశారు. ఈ ఘటన సోమవారం రాత్రి నాగారం మండల కేంద్రంలో జరిగింది. బాధిత రైతుల తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మండల కేంద్రానికి చెందిన రైతు బొబ్బలి కనకయ్య ఎకరం భూమిలో మిర్చి పంట సాగు చేశాడు. సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మిర్చి పంటపై గడ్డి మందు పిచికారీ చేయడంతో పంట పూర్తిగా ధ్వంసమైంది. ఈ మిర్చి పంట విలువ సుమారు రూ.3లక్షల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. బాధిత రైతు మంగళవారం నాగారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం. ఐలయ్య తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం

రామన్నపేట: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లంకి గ్రామానికి చెందిన వనం బాలరాజు(38) చేనేత వృత్తి మీద ఆధారపడి జీవిస్తున్నాడు. అతడికి భార్య రాజేశ్వరి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆర్థిక సమస్యలతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో కొద్దిరోజులుగా రాజేశ్వరి తన పిల్లలతో కలిసి అదే గ్రామంలో తన తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసైన బాలరాజు మనస్తాపానికి గురై మంగళవారం ఉదయం ఇంట్లో దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పాఠశాల నుండి వచ్చిన బాలరాజు పెద్ద కుమార్తె మధుబాల తండ్రి దూలానికి వేలాడుతుండటం చూసి ఏడ్చుకుంటూ తల్లి వద్దకు పరుగెత్తి విషయం చెప్పింది. ఆమె స్థానికులతో కలిసి ఇంటికి వెళ్లి చూడగా అప్పటికే బాలరాజు మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. మల్లయ్య తెలిపారు.



బాలరాజు (ఫైల్)

ఇసుక డంప్ సీజ్

మద్దిరాల: మండల పరిధిలోని ముకుందాపురం గ్రామ శివారులోని సమ్మక్క సారక్క గద్దెల వద్ద ముత్యాలమ్మ బండలకు సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన 50 ట్రక్కుల ఇసుకను తహసీల్దార్ అమీన్‌సింగ్ మంగళవారం పరిశీలించి సీజ్ చేశారు. పంచనామా చేసి ఇసుక డంప్‌ను పంచాయతీ కార్యదర్శి వెంకట్‌కి అప్పజెప్పినట్లు తెలిపారు. గ్రామస్తులు అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.



ఇసుక డంప్ సీజ్ చేస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్

అపహరించిన ఆటోతో పట్టుబడిన నిందితులు

వలిగొండ : ఆటోను అపహరించి అదే ఆటోలో తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం వలిగొండ మండలం నాగారం వై జంక్షన్ వద్ద మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం వై జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా.. నంబర్ ప్లేట్ లేని ఆటోలో వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపగా.. వారు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిని విచారించగా ఆటోను దొంగతనం చేసిన పక్క రాష్ట్రంలో అమ్మేందుకు వెళ్తున్నట్లు ఒప్పుకున్నారు. నిందితులు సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం పఠాన్‌చెర్వు కుమ్మరిబస్తీకి చెందిన చెన్న సత్యనారాయణ, చెన్న సురేష్‌గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరు 8వ తేదీన భువనగిరిలో ఆటోను కిరాయికి మాట్లాడుకొని వేములకొండకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వలిగొండ–భువనగిరి మార్గంలో ఆటో డ్రైవర్‌కు మద్యం తాగించి అతడిని బెదిరించి ఆటోను దొంగిలించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం రెండో రోజు గోదాదేవిని ప్రత్యేకంగా అలంకరించి రెండో పాశురాన్ని పఠించారు. అమ్మవారికి మహిళా భక్తులు మంగళహారుతులతో నీరాజనాలు పాడారు. ధనుర్మాసంలో గోదాదేవికి జరిపించే విశేష పూజలు, పాశురాలకు సంబంధించిన విశిష్టతను ప్రధానార్చకులు భక్తులకు వివరించారు.



గోదాదేవికి హారతి ఇస్తున్న ప్రధానార్చకుడు

యువకుడి అదృశ్యం

- కృష్ణా నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటానని కుటుంబ సభ్యులకు వీడియో కాల్

మిర్యాలగూడ: తనకు కారు కొనివ్వకపోతే కృష్ణా నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటానని ఓ యువకుడు కుటుంబ సభ్యులకు వీడియోల్ కాల్ చేసి అదృశ్యమయ్యాడు. వాడపల్లి ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం శూన్యపహాడ్ గ్రామానికి చెందిన రమావత్ శంకర్ (25) సెల్ టవర్ల నిర్మాణ సంస్థలో కూలీ పనికి వెళ్తుంటాడు. శంకర్ తనకు బైక్‌ను కొనివ్వాలంటూ తల్లిదండ్రులపై ఒత్తిడి తేవడంతో ఆరు నెలల క్రితం అతడికి బైక్ కొనిచ్చారు. ఇటీవల తనకు కారు కావాలంటూ తల్లిదండ్రులను అడగగా కటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేదని నచ్చజెప్పారు. అయినా వినకుండా రెండు రోజుల క్రితం తనకు కారు కొనివ్వకపోతే చనిపోతానంటూ శంకర్ తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు దామరచర్ల శివారులో శంకర్‌ను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. తిరిగి మంగళవారం శంకర్ దామరచర్ల మండలం వాడపల్లి వద్ద కృష్ణా నదిలో దూకి తాను చనిపోతున్నానంటూ కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేయడంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు కృష్ణానది వద్దకు చేరుకోగా.. వాడపల్లి బ్రిడ్జి పక్కన శంకర్ చెప్పులు, సెల్‌ఫోన్ గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకోని నదిలో దూకి ఉండవచ్చనే అనుమానంతో నదిలో గాలింపు చర్యలు చేపట్టారు.



శంకర్

రేషన్ బియ్యం పట్టివేత

గుర్రంపోడు: మండలంలోని తానేదార్‌పల్లి, జూనూతుల గ్రామాల నుంచి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్ఐ మధు తెలిపారు. బోలగాని అంజనేయులు అనే వ్యక్తి వద్ద నుంచి 38 బస్తాల (19 క్వింటాళ్ల) రేషన్ బియ్యాన్ని కొర్ర నాగరాజు అనే వ్యక్తి తన ఆటోలో వేసుకుని వెళ్తుండగా జూనూతుల సమీపంలో పట్టుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. నాగరాజు ఇచ్చిన సమాచారం మేరకు తానేదార్‌పల్లిలో పాంపాటి అశోక్ వద్ద 10 బస్తాలు, గార్లపాటి వెంకటేశ్వర్లు వద్ద 10 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భూదాన్‌పోచంపల్లిలో 20 క్వింటాళ్లు...

భూదాన్‌పోచంపల్లి: మినీ వాహనంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని హైదరాబాద్‌కి తరలిస్తుండగా ఎస్ఓటీ పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. భూదాన్‌పోచంపల్లి మండలం రామలింగంపల్లి గ్రామానికి చెందిన రామావత్ సురేష్ రేషన్ లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి వాహనంలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఓటీ పోలీసులు మంగళవారం రాత్రి అలీనగర్ సమీపంలో పట్టుకున్నారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr.J అకాడమి (ISO 90001: 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112 [HA-15347]

Real Estate

HOUSE FOR SALE

■ నల్లగొండ టౌన్, Hyd Roadలో 99,99,999/–లకే శ్రీనగర్‌లో 300Yds. Reddy Community వెడల్పు రోడ్, కబోర్డ్స్ ఉన్న ఇల్లు పర్మిషన్ కలదు. సంప్ర॥ 9247272429 [Y-1145772]

Wanted

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషేంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ: 18K. Ph: 9640468899, 9640258899 [SCA24000827]

Services

MARRIAGE SERVICES

■ క్రైస్తవ వివాహ పరిచయ వేదిక డిసెంబర్ 21 శనివారం, 10am-2pm@సికింద్రాబాద్ YMCA. మీ ప్రొఫైల్స్‌ను వాట్సాప్ చేయండి. ఫోన్: 7330957771 www.christianholymatrimony.com [HA-99314]

BUMPER OFFER

■ 5 Shirts-1000/-, 5 Points-1000/- షాపు మొత్తం 20% డిస్కౌంట్ జెంటిల్‌మెన్ మెన్స్‌వేర్, కీర్తి క్రియేషన్స్ ప్రక్కన, ప్రకాశం బజార్, నల్లగొండ. సంప్ర॥ 9247272429 [Y-1145773]

BUSINESS SERVICES

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011–25920179 [DA-6124]

పార్టనర్స్ కావలెను

■ 200 ఎకరాలలో ఇసుక (రీచ్) కలదు. సుమారు 500 కోట్ల ప్రాజెక్ట్ Govt Permission కూడా కలదు. వ్యాపారం చేయుటకు ఆర్థికంగా పెట్టుబడి పెట్టగల పార్టనర్స్ కావలెను. మిగతా వివరాలకు ఫోన్ చేయగలరు. 8179974265, 9000537265 [Y_798498]

CHANGE OF NAME

■ I THUMMALA SRIDHAR REDDY S/o RUKMA REDDY, R/o H.No 6-8-39/16, Plot No. 22, Adarsha colony, Ravindra nagar, Nalgonda, Telangana. 508001. Here by declare that I have changed my name from TUMMALA SRIDHAR REDDY (old name) to THUMMALA SRIDHAR REDDY (As per my adhaar and PAN CARD) for the correction in the passport and all future purposes. [YA_15747]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకు లను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ది. నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి. నల్లగొండ
బ్రాంచి : మోత్కూరు.

స్థిరాస్తి (వ్యవసాయ భూములు) బహిరంగ వేలము ప్రకటన

తెలంగాణ సహకార సంఘముల రూల్–52 ఇ ప్రకారము

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ! నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ బ్రాంచి : మోత్కూరు నుండి దీర్ఘకాలిక అప్పు (మార్ట్ గేజ్ ఋణము) పొంది అట్టి అప్పు బాపతు వాయిదా మీరిన చెల్లించని కిస్తులు రాబట్టుకొనుటకు ఈ క్రింది బకాయి దారునకు సంబంధించిన బ్యాంకునకు తాకట్టు పెట్టబడిన స్థిరాస్తి (వ్యవసాయ భూమి) బహిరంగ వేలం ద్వారా విక్రయించబడును. వేలము వేయబడు భూముల వివరములు, తేది మరియు ప్రదేశము ఈ క్రింద తెలుపబడినది. వేలములో పాల్గొను వ్యక్తులకు వేలము నియమ నిబంధనలకు కట్టుబడి వేలములో పాల్గొనవచ్చును

క్ర. సం.	బకాయిదారుని పేరు మరియు తండ్రి పేరు	సర్వే నెం.	విస్తీర్ణము ఎ.గుం॥	భూమి ఉన్న శివారు గ్రామము	వేలము తేది, సమయము మరియు ప్రదేశము
1	ఈదుల ముత్తయ్య తండ్రి పెద్ద వెంకయ్య గ్రా॥ గట్టు సింగారం	790/ఈ	3.35	గట్టు సింగారం	తేది. 20-12-2024 మ॥ 12-00 గం॥లకు గ్రామ పంచాయతి కార్యాలయము గట్టు సింగారం మండలం అడ్డగూడూరు. యాదాద్రి భువనగిరి.
		మొత్తం	3.35		
2	సూరారం మహేశ్వరి భర్త నవీన్ గ్రామము: డి.రేపాక	347/6/2 334/రూ/2 347/రూ/2	0-20 0-015 0-185	డి. రేపాక	తేది. 20-12-2024 మ॥ 3-00 గం॥లకు గ్రామ పంచాయతి కార్యాలయము డి.రేపాక మండలం అడ్డగూడూరు. యాదాద్రి భువనగిరి.
		మొత్తం	1.00		

వేలము – నియమ నిబంధనలు

1. వేలము వేయబడు భూములు బ్యాంకు వారికి తాకట్టు పెట్టబడినందున జప్తు చేయబడి వేలము వేయబడుచున్నది.
2. వేలములో పాల్గొను వ్యక్తి వేలమునకు ముందుగా రూ॥ 25,000/- (అక్షరాల ఇరవై ఐదు వేల రూపాయలు) డిపాజిట్ (ఇ.ఎం.డి.) సేల్ ఆఫీసర్ వద్ద డిపాజిట్ చేసి వేలములో పాల్గొనవచ్చును.
3. వేలము సరైన ధర వచ్చినట్లు భావించిన వేలము అత్యధిక పాటదారుని పేరున వేలము ఖరారు చేయబడును.
4. అత్యధిక పాటదారుడు వేలము విలువలో 15% వేలము ముగిసిన వెంటనే చెల్లించవలయును. మిగతా 85% మరియు స్టాంపు డ్యూటీ ఫీజు చార్జీలను కూడా వేలము తేది నుండి (15) దినములలోగా పూర్తిగా చెల్లించవలయును. లేనిచో చెల్లించిన సొమ్ము తిరిగి ఇవ్వబడదు. జప్తు చేసుకోబడును.
5. ఎట్టి పరిస్థితిలో కూడా (15) దినములకు మించి సమయం ఇవ్వబడదు.
6. వేలములో ఒక వ్యక్తికి మించి పాల్గొనదలచినచో అట్టి వ్యక్తులు ఉమ్మడిగా వేలములో పాల్గొనుచున్నట్లు అందరి తరుపున ఒక వ్యక్తికి అధికారమిస్తూ అఫిడవిట్ ఇవ్వవలయును. అట్టి అఫిడవిట్ రూ॥ 50/-ల స్టాంపు పేపరు పై ఇవ్వాలి.
7. వేలములో పాల్గొను వ్యక్తులు వేలము నియమ నిబంధనలకు కట్టుబడి ఉన్నట్లు వేలమునకు ముందు నిర్ణీత ఫారంలో అంగీకారం ఇవ్వవలయును.
8. వేలములో పాల్గొను వ్యక్తులు ప్రకటించబడిన భూములను స్వయముగా సందర్శించి, తృప్తిపడి అన్ని ఉన్న వసతులే అంతిమం.
9. సదరు భూములకు రహదారుల విషయములో ఏ విధమైన హామీలు బ్యాంకు తరుపున ఉండవు. స్థానికంగా ఉన్న వసతులే అంతిమం.
10. కొనుగోలుదారుడు పూర్తి డబ్బు చెల్లించి భూమి మార్పిడి చేసుకొను వరకు అట్టి భూమిపై ఏ విధమైన హక్కు ఉండదు.
11. వేలము వేయబడు భూమి విషయములో ఏ విధమైన అభ్యంతరములు వచ్చిననూ అవి పరిష్కరించు ఉత్తర్వులు జారీ చేసిన పిదప వేలము ఖరారు చేయబడును.
12. వేలము వేయబడు భూములు ఏకమొత్తముగా గాని, విడివిడిగా గాని, విక్రయించుటకు సేల్ ఆఫీసర్‌కి పూర్తి అధికారము కలదు.
13. ఎట్టి కారణములు చూపకుండ వేలము వాయిదా వేయుటకు గాని రద్దు చేయుటకు గాని అధికారము కలదు. (OR/(OSD.N.D.C.C.Bank Ltd., Nalgonda)
13. ఇతర వివరములకు సేల్ ఆఫీసర్ గారిని గాని లేదా డిప్యూటీ రిజిస్ట్రార్ / ఓ.యస్.డి. గారిని గాని సంప్రదించవచ్చును.

స్థలం :మోత్కూరు,
తేది :11.12.2024.

సేల్ ఆఫీసర్, యన్.డి.సి.సి. బ్యాంకు లి.,
నల్లగొండ. బ్రాంచ్ : మోత్కూరు.